# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 03.04.2025 | 24 క్యారెట్లు 88,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:162

www.vishalabharati.com


# బీసీ రిజర్వేషన్లపై ఇక ధర్మ యుద్ధమే..

- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- తెలంగాణ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించాలి
- గుజరాత్‌లో పెంచమని మేమడగటం లేదు
- మా రాష్ట్రంలో పెంచడానికి వచ్చిన నష్టమేంటి..?
- అంగీకరించకుంటే ఉద్యమం దేశమంతా పాకుద్ది
- పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో సభ పెడతాం
- మళ్లీ ఢిల్లీకి రాము.. మోదీనే మా గల్లీకి రావాలి
- మా డిమాండ్‌కు దిగి రావాలి.. లేదంటే దిగిపోవాలి
- ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- జంతర్ మంతర్ వేదికగా బీసీల పోరు గర్జన



బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని.. లేదంటే మోడీపై ధర్మయుద్ధం తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ శాసనసభ తీర్మానం చేసిందని.. ఆ బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాలు చేపట్టిన పోరు గర్జన ధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా లెక్క తేలాలన్నారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జనాభా లెక్కలు తెలియకపోతే రిజర్వేషన్లు ఇచ్చేందుకు లేదని కోర్టులే చెప్పాయని తెలిపారు. దీంతో జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని రేవంత్ ఆరోపించారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చామని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటిసారి కులగణన చేసిందని.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే తాము

..మిగతా 2 లో

## రేవంత్ రియల్ హీరో

- 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మా పాలిట దేవుడు అవుతారు
- బీసీలంతా సీఎంకు అండగా నిలబడతాం
- కేంద్రం తెలంగాణ తీర్మానాన్ని ఆమోదించాలి
- సినీ నటుడు సుమన్ సంచలన వ్యాఖ్యలు

2 లో

# బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్రానిదే

- మోడీని సంప్రదించి హామీ ఇచ్చారా..?
- మీ చేతగానితనాన్ని కేంద్రంపై రుద్దొద్దు
- ముస్లింలను బీసీలలో ఎందుకు చేర్చారు
- మతపరమైన రిజర్వేషన్లకు మోడీ వ్యతిరేకం
- బీసీ సంఘాలు నోరెందుకు ఎత్తడం లేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంచుకునేందుకు కేంద్రం అమోదం తెలపాలని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీ వేదికగా జరిగిన బీసీ మహాగర్జన ధర్నాలో చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఇవాళ ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేషన్ కమిషన్



వేసుకుని చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల

..మిగతా 3 లో



# హెచ్‌సీఏలో భారీ అవినీతి

- ఉప్పల్ స్టేడియాన్ని ముట్టడించిన యూత్ కాంగ్రెస్
- జగన్మోహన్‌రావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- హరీష్‌రావు బినామీలా వ్యవహరిస్తున్నాడు
- ఐపీఎల్ టికెట్స్‌బ్లాక్ చేస్తూ సన్ రైజర్స్‌పై ఒత్తిడి
- జగన్మోహన్‌రావు దిష్టిబొమ్మ దహనం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హెచ్.సి.ఏ వైఖరి నిరసిస్తూ ఉప్పల్ క్రికెట్ స్టేడియంను యూత్ కాంగ్రెస్ నాయకులు ముట్టడించారు. HCA చైర్మన్ జగన్ మోహన్ రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవినీతికి పాల్పడిన జగన్ మోహన్ రావుపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. హరీష్ రావు బినామీలా జగన్ మోహన్ రావు వ్యవహరిస్తూ ఐపీఎల్ టికెట్స్ బ్లాక్ చేస్తున్నాడని యూత్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఇవి సరిపోక ఇంకా టికెట్స్ కావాలని సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుపై ఒత్తిడి తెస్తున్నాడని ఆరోపించారు. ఇలా ఒత్తిడి చేసి SRH వేరే రాష్ట్రానికి తరలిపోవాలి అని

..మిగతా 3 లో

# నాలుగేళ్లు చర్యలు తీసుకోకున్నా.. మేం చూస్తూ కూర్చోవాలా..?

- స్పీకర్‌ను కోర్టును పిలిచామన్న సంగతి మరవొద్దు
- రాజ్యాంగ పరిరక్షణ కోర్టుల విధి
- నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా..?
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్
- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై విచారణ
- విచారణ నేటికి వాయిదా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై బుధవారం నాడు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ కి కోర్టులు సూచనలు చేసే అంశంపై సుదీర్ఘంగా వాదనలు సాగాయి. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ

..మిగతా 2 లో

# గులాబీ జెండా సత్తా చాటాలి

- నియోజకవర్గానికి లక్షకు తగ్గొద్దు
- రజతోత్సవ సభను భారీగా తరలిరావాలి
- సన్నాహక సమావేశాలు నిర్వహించాలి
- బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ సూచన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ నేతలతో

..మిగతా 3 లో


# జీహెచ్ఎంసీకి పైసలే పైసలు..

- భారీగా పెరిగిన ఆదాయం
- టార్గెట్‌ను మించి రూ.2038 కోట్లు వసూలు

..మిగతా 3 లో

# శాంతి చర్చలకు సిద్ధం

- దండకారణ్యంలో కాల్పులు ఆపండి
- మేం కూడా కాల్పుల విరమణ పాటిస్తాం
- లేఖ విడుదల చేసిన మావోయిస్టు కేంద్ర కమిటీ
- ఇటీవల కాలంలో వరుస ఎన్‌కౌంటర్లు
- వందల సంఖ్యలో పిట్టల్లా రాలిన మావోయిస్టులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మావోయిస్టుల్లో భయం మొదలైంది. మావోయిస్టు రహిత భారత్ నినాదంతో ఆపరేషన్ కగార్‌ను కేంద్రం దూకుడుగా ముందుకు తీసుకెళుతుండడంతో

..మిగతా 2 లో

# హెచ్‌సీయూ భూములపై.. ముదురుతున్న వివాదం

- ఆందోళన కొనసాగిస్తున్న విద్యార్థులు
- జేసీబీల వైపు దూసుకెళ్తే యత్నాలు
- అడ్డుకున్న పోలీసులు.. లాఠీచార్జ్
- చెట్లు నరకడం ఆపాలని హైకోర్టు ఆదేశాలు
- 400 ఎకరాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి
- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు
- ఆ భూములు 100 శాతం ప్రభుత్వానివే
- చెట్లు పెరిగితే అడవి అయితదా..?
- మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమి విషయంలో రోజురోజుకూ వివాదం ముదురుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థులు ఎవరికి వారు తగ్గేదేలేదని అంటున్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం చదును చేస్తున్న 400 ఎకరాల భూమి వైపు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఒక

..మిగతా 3 లో




# ఎల్ఆర్ఎస్‌కు మరో ఛాన్స్

- ఏప్రిల్ 30 వరకు గడువు పొడగింపు
- కొనసాగనున్న 25 శాతం ఫీజు రాయితీ
- ఆశించిన మేర జరగని రిజిస్ట్రేషన్లు
- ఇప్పటివరకు రూ.1200 కోట్ల రాబడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ల

..మిగతా 3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# బీసీ రిజర్వేషన్లపై ఇక ధర్మ యుద్ధమే..

మొదటి పేజీ తరువాయి

తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ (మోదీ) రాష్ట్రంలో చేయమని మేము అడగలేదని సీఎం గుర్తు చేశారు.

**మోడీకి వచ్చిన కష్టమేంటి..?**

మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహాధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు "అయిననూ హస్తిన పోయి రావలె".. ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నామన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారని ఆరోపించారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారు. ఆర్టికల్ 370 రద్దు చేశారు. వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చింది? అంటూ నరేంద్రమోదీని సీఎ నిలదీశారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారు. మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలని సీఎం రేవంత్ తెలిపారు.

**దిగి రావాలి.. లేదంటే దిగిపోవాలి..**

మీరు మా డిమాండ్లకు దిగి రావాలి. లేదంటే దిగిపోవాలి, బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలి. నరేంద్ర మోదీ గారు వినండి. మేము ఇక ఢిల్లీకి రాం. మీరే మా గల్లీకి రావాలంటూ సంచనల ప్రకటన చేశారు సీం రేవంత్ రెడ్డి, కురుక్షేత్ర యుద్ధంలో 5 గ్రామాలు ఇవ్వాలని సంధి ప్రయత్నం జరిగింది. కానీ దుర్యోధనులు వినలేదు. తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. మేము కూడా ఇప్పుడు సయోధ్యకు వచ్చాం. మా రిజర్వేషన్ల పెంపునకు ఆమోదం చెప్పండి లేదంటే ధర్మ యుద్ధం తప్పదని సీఎం రవంత్ రెడ్డి హెచ్చరించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుకుంటామని మేం కోరాం. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతి ఇస్తే 10 లక్షల మందితో సభ పెట్టి మోదీని సన్మానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు. బీసీల పోరు గర్జనకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు.. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సహా బీసీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్కు చెందిన బీసీ నేతలు కూడా ధర్నాలో పాలు పంచుకున్నారు. ఇక సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎన్సీపీ శరద్ పవార్ గ్రూప్ ఎంపీ సుప్రియా సూలేతో పాటు 29 రాష్ట్రాల ఓబీసీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని బీసీలకు సంఘీభావం ప్రకటించారు.





# రేవంత్ రియల్ హీరో

- 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మా పాలిట దేవుడు అవుతారు
- బీసీలంతా సీఎంకు అండగా నిలబడతాం
- కేంద్రం తెలంగాణ తీర్మానాన్ని ఆమోదించాలి
- సినీ నటుడు సుమన్ సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బీసీలకు రిజర్వేషన్లు తీసుకువచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ హీరో అని సినీనటుడు సుమన్ ప్రశంసించారు. ఎన్నికల ప్రచారంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి....ఆ హామీని నెరవేర్చిన హీరో అని అభివర్ణించారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన హీరో అంటూ సుమన్ కొనియాడారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం జరుగుతున్న బీసీల పోరు గర్జన సభకు సుమన్ హాజరై తన సంఘీభావం ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సందేహాలు వ్యక్తమైన తరుణంలో అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే బిల్లుకు ఆమోదం లభించడం చాలా సంతోషకరం అని సుమన్ చెప్పుకొచ్చారు.

**రేవంత్‌మా పాలిట దేవుడు**

రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా బిల్లును తీసుకువచ్చి చూపించిన సీఎం రేవంత్ రెడ్డికి తాము మద్దతుగా నిలుస్తామని చెప్పుకొచ్చారు. యావత్ బీసీ సమాజం అంతా రేవంత్ రెడ్డికి అండగా ఉంటాం అని చెప్పుకొచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బీసీలు, గౌడ్లు ఉన్నారని... రేవంత్ రెడ్డి పెద్దమనసు చేసుకుని వారికి ఎస్టీ స్టేటస్ ఇవ్వాలని సుమన్ కోరారు. ఈ డిమాండ్ చాలా కాలంగా ఉందని ఇది నెరవేరిస్తే మీరే తమ పాలిట దేవుడు అవుతారని నటుడు సుమన్ చెప్పుకొచ్చారు. నరేంద్ర మోడీ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా హీరో సుమన్ విజ్ఞప్తి చేశారు.


## మళ్లీ నిలిచిన యూపీఐ సేవలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో: దేశ వ్యాప్తంగా మరోసారి డిజిటల్ చెల్లింపులకు అంతరాయం ఏర్పడింది. డౌన్ డెటెక్టర్ లోని డేటా ప్రకారం గూగుల్ పే, పేటీఎం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూపీఐ యాప్స్ పనిచేయకపోవడంతో కస్టమర్లు ఇబ్బందిపడ్డారు. ఏప్రిల్ 2న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ట్రాన్సక్షన్స్ జరపడంలో సమస్యలు రావడంతో కస్టమర్లు గందరగోళానికి గురయ్యారు. మార్చి 26న యూపీఐ ట్రాన్సక్షన్స్ లో ఇదే సమస్య రాగా మళ్లీ ఇవాళ అదే సమస్య రావడంతో కస్టమర్లు ఫైర్ అవుతున్నారు. స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్రకారం ఏప్రిల్ 2న రాత్రి 8 గంటల నాటికి 449 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో 64 శాతం మనీ ట్రాన్స్ ఫర్, 28 శాతం పేమెంట్స్, 8 శాతం యాప్ సమమస్యలు తలెత్తాయి. అలాగే ఎస్బీఐలో 57 శాతం కస్టమర్లు మనీ ట్రాన్సక్షన్ జరపడంలో ఇబ్బంది వచ్చిందని కంప్లైంట్ ఇచ్చారు.

# ప్రకృతినీ ముట్టుకుంటే విధ్వంసంకు రెడ్ కార్పేట్ పరచినట్టే..

**అది యూనివర్సిటీ భూమా...? ప్రభుత్వ భూమా..? అనే విషయం కాసేపు పక్కన పెట్టి తెలంగాణ ప్రజలారా మనందరం ఆలోచన చేద్దాం......**

అది హైద్రాబాద్ కు ఆక్సిజన్ ఇచ్చే పచ్చటి అడవి. తీరొక్క జీవరాశికి ఆదెరువు. చెట్లు చెమలు కూలగొట్టి... చెరువులు పూడ్చేశి... నెమళ్లను జింకలని తరిమి...కుందేళ్లను గెదిమి...పచ్చని భూములనీ అమ్మకానికి పెడ్తం అంటున్నరు.అక్కడ ఏమైనా పులులు, సింహాలు ఉన్నాయా, నక్కలు ఉన్నాయి, అంతే అంటున్న నాయకుల మాటలు విన్నాక.



అంటే వాళ్ళ మాట ప్రకారం పులులు సింహాలు ఉంటే అడవిని ధ్వంసం చేయొచ్చా చెప్పండి మీరే?నక్కలైన పులులైన నెమళ్ళు, జింకలైన, కోతులైన సమస్త జీవరాశికి హ అడవినే కదా ఆధారం.వేల కోట్ల రూపాయలుకు భూములు అమ్మి.. అద్దాల మేడలు... అందాల బంగ్లాలు కట్టడమే అభివృద్ధి అనుకుంటున్నారా ఎట్ల పాలకులు?

ఇప్పటికే రంగారెడ్డి జిల్లా శివారు ప్రాంతాల గుట్టలు మింగిర్రు...అడవులు నరికింద్రు... చెరువులు కబ్జా వెట్టింద్రు. ఎత్తైన ఆకాశ హర్మహారాలు కట్టినరు.ఇప్పటికే గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, నార్సింగి, నానక్ రామ్ గూడల ప్రకృతిని సర్వ నాశనం జేశి అద్దాల మేడలు కట్టినరు. అదే అసలైన అభివృద్ధి అన్నట్టు పోటీపడుతున్నారు పాలకులు.

దామగుండం రాడార్ స్టేషన్ కోసం వెయ్యి ఎకరాల అడవిని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటే...ఎన్ని వేల చెట్లు కొట్టెయ్యాలె... ఎన్నో మూగ జీవాలు బలిగావాలె...ఎంత ప్రకృతి విధ్వంసం జరుగాలె. రేడియేషన్ తో డేంజర్ అన్నారు. ఇదేందని అడిగితే... అది దేశ రక్షణ కోసం అన్నరు..దేశమంటే మనుషులే కదా?మరి ఇప్పుడు ఆ జనం కోసమే గచ్చిబౌలి భూమి అమ్మేస్తరట. మనకెం బాధని ఉకుందామా?

జనతా గ్యారేజీ వంటి సీన్మా చూసి చప్పట్లు కొడతాం..వావ్ అంటాము కానీ కండ్ల ముందే పచ్చనీ అడవినీ ఖతం చేయాలనీ చూస్తే చోద్యం చూస్తాము.

మేమంతా ప్రకృతి ప్రేమికులం, ప్రకృతి మీద ఎంత ప్రేమంటే అది చూపించుకోవడానికి అనిపించుకోవడానికి అందమైన ఫోటోలు..మంచి మాటలు, సూక్తులు రాసి లైకులు, కామెంట్లు తెచ్చుకుంటాం.

గతంలో మన హైదరాబాద్ లో విలువైన భూములు అమ్మితే వేల కోట్లు రూపాయలు వచ్చినయి..100 కోట్లకు ఒక్క ఎకరం అమ్మిన ప్రభుత్వాలు ... హైద్రాబాద్ ప్రపంచ పటంలో గొప్పగా ఎదిగిపోతోందని చూపించారు. ఇప్పుడుఈ ప్రభుత్వం కూడా అమ్ముత అంటుంది అంతేనా?..

ప్రాజెక్టుల కోసం ఊర్లకు ఊర్లను ఖాళీ చేయించి రైతుల భూములు గుంజుకునీ అభివృద్ధి కోసం అంటారు.

**అప్పుడు ఆళ్లది తప్పే..ఇప్పుడు ఈళ్లది తప్పే..**

ప్రకృతినీ వేలానికి వేసినప్పుడల్లా.... మేధావులు ఎక్కడవొయినారు, కవులెందుకు రాస్తలేరు..? కళాకారులెందుకు పాడ్తలేరు..? అంటరు. మనందరికీ బాధ్యత ఉండాలి కదా? మనము కూడా మంచో చెడో గమనించాలి కదా?

పార్టీ ఏదైనా, ప్రభుత్వం ఏదైనా ప్రకృతిని ముట్టుకుంటే విధ్వంసాన్ని స్వాగతించడమే కదా!



-శేఖర్ పగిళ్ల
జర్నలిస్ట్

# నాలుగేళ్లు చర్యలు తీసుకోకున్నా.. మేం చూస్తూ కూర్చోవాలా..?

మొదటి పేజీ తరువాయి

వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల బీఆర్ఎస్ నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

"స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు'' అని ముకుల్ రోహత్గీ వాదించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు.



**"2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు. సరైన సమయం అంటే మీ దృష్టిలో ఎంత కాలం అని జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్ ప్రశ్నించారు . అది స్పీకర్ మాత్రమే నిర్ణయిస్తారని ముకుల్ రోహత్గి.సమాధానం ఇచ్చారు. ముకుల్ రోహత్గి వాదనలు ముగియడంతో రేపు అసెంబ్లీ కార్యదర్శి తరపున వాదనలు వినిపిస్తా అన్న సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. రేపు ఉదయం 10.30గం.లకు ధర్మాసనం సమయం కేటాయించింది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తరపున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవి శంకర్ వాదనలు వినిపించనున్నారు.**



# శాంతి చర్చలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

మావోల స్వరం మారుతోంది. ఇన్నాళ్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అడవిలో పోరాడిన మావోయిస్టులు తాజాగా శాంతి చర్చల అంశాన్ని తెరపైకి తెచ్చారు. కేంద్రంతో చర్చలకు తాము సిద్ధమని ఓ లేఖ విడుదల చేశారు. ఛత్తీస్ గఢ్ , ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, మహారాష్ట్రలో కాల్పులు నిలిపివేయాలని బహిరంగ లేఖ విడుదల చేశారు. తాము కూడా కాల్పుల విరమణను పాటిస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు. మార్చి 24న హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహణను స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఈ లేఖ విడుదలైంది. తాము చేస్తున్న ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ఈ మేరకు శాంతి చర్చల కమిటీకి, దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, జర్నలిస్టులకు, ఇతర సంఘాలకు విజ్ఞప్తి చేశారు. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్ను చేపట్టాలని కోరారు.2024 జనవరిలో కేంద్ర ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'కగార్' పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయని లేఖలో ఫైర్ అయ్యారు. ఆ సమయంలో ప్రజల్ని మోసగించడానికి ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి విజయ్ శర్మ తమ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమే, మావోయిస్టులు చర్చలకు రావాలని పదే పదే ప్రకటనలు చేశాడన్నారు. ఆ సమయంలో మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ వికల్ప్ తమ పార్టీ శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించినట్లు గుర్తు చేశారు. సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని ప్రతిపాదించాడన్నారు. బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్ లకే పరిమితం చేయాలని సూచించాడన్నారు. సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశాడన్నారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయన్నారు. ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైగా మరణించారన్నారు. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారని ఆరోపించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 విడుదలైంది. ఈ జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు. ఇక ఈ జాబితాలో యూఎస్ టాప్‌లో ఉంది. మొదటి పది స్థానాల్లో ఉన్న సంపన్నుల్లో ఎక్కువ మంది అమెరికన్లే ఉన్నారు. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్రానిదే

మొదటి పేజీ తరువాయి




సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఆ హామీ ఇచ్చేటప్పుడు మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఇచ్చారా? మరి ఇప్పుడెందుకు మోడీ ప్రభుత్వంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని నిలదీశారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని షో చేయడం కాదు... ఆ రాజ్యాంగంలో ఏముందో అర్థం చేసుకొని అమలు చేయాలనే ఇంగిత జ్ఞానం కాంగ్రెస్ నేతలకు లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కు స్పష్టమైన మెజారిటీ ఉంది. బీఆర్ఎస్ సపోర్ట్ కూడా ఉంది. అలాంటప్పుడు బీజేపీపై నెపం ఎందుకు నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేతగానితనాన్ని కేంద్రంపై రుద్ది తప్పించుకోవాలనుకుంటున్నారని విమర్శించారు.

**ముస్లింలను బీసీల్లో ఎందుకు చేర్చారు..?**

మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని ఈ విషయం మీకు తెలియదా అని సీఎంను బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ విషయం తెలిసి కూడా ముస్లింలను బీసీ జాబితాలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. తెలంగాణలో 56 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే 46 శాతానికి తగ్గించింది. 80 శాతానికి పైగా ముస్లింలను బీసీ జాబితాల్లో చేర్చి బీసీల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే కేంద్రం ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కాంగ్రెస్ రూపొందించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లులో 10 శాతం మంది ముస్లింలే ఉన్నారు. అంటే ఈ బిల్లువల్ల ముస్లింలు అదనంగా 10 శాతం రిజర్వేషన్ల లబ్ధి పొందితే, బీసీలకు అదనంగా దక్కేది 5 శాతం మాత్రమే. ఈ లెక్కన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసినట్లా? అన్యాయం చేసినట్లా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరును చూస్తుంటే ముస్లింల కోసమే బీసీ రిజర్వేషన్లు తెచ్చినట్లు స్పష్టమవుతోందన్నారు.

**డ్రామాలు ఆపాలి..**

బీసీలకు ఇంతటి ఘోరమైన అన్యాయం జరుగుతుంటే బీసీ సంఘాల నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు అని బండి సంజయ్ ప్రశ్నించారు పైగా కాంగ్రెస్ ను సంకనేసుకుని ఢిల్లీకిపోయి ధర్నాల పేరుతో డ్రామాలాడటం ఎంతవరకు కరెక్ట్? అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ తీరును, బీసీ సంఘాల తీరును బలహీనవర్గాల ప్రజలతోపాటు తెలంగాణ సమాజమంతా గమనిస్తోందని సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకుని ఇకనైనా బీసీ రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

# జీహెచ్ఎంసీకి పైసలే పైసలు..

- భారీగా పెరిగిన ఆదాయం
- టార్గెట్‌ను మించి రూ.2038 కోట్లు వసూలు
- కొత్త ఏడాది మరింత పెరిగే ఛాన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




ఎనిమిదేళ్ల గులాబీ పాలనలో అప్పుల పెరిగి , ఆగమాగమైన జీహెచ్ఎంసీకి కొత్త ఆర్థిక సంవత్సరం (202526) బాగా కలిసొచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (202425)కు సంబంధించిన గత మార్చి నెలాఖరు వరకు టార్గెట్ ను మించి రూ. 2038 కోట్లు వసూలు కాగా, జీహెచ్ఎంసీ ముఖ్య ఆదాయ వనరుల్లో రెండోది ప్లానింగ్. భవన నిర్మాణ అనుమతులు, నిర్మాణం పూర్తయిన భవనాలకు ఆక్రమించుకునే అక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీతో ఈ విభాగానికి కూడా గత ఆర్థిక సంవత్సరం భాగానే ఆదాయం సమకూరినట్లు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరం (202425) లో జీహెచ్ఎంసీ మొత్తం 13 వేల 421 అన్ని రకాల నిర్మాణ అనుమతులను జారీ చేసి, రూ. 1138.44 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో ఇన్ స్టెంట్ రిజిస్ట్రేషన్లు 523 కాగా, ఇన్ స్టెంట్ అప్రూవల్స్ 8377, సింగ్ విండో ద్వారా మరో 2422, లే అవుట్ విత్ హౌజింగ్ అండర్ గెటెడ్ కమ్యూనిటీ లు 6, లే అవుట్ విత్ ఓపెన్ ప్లాట్స్ 5, అక్యుపెన్సీ సర్టిఫికెట్లు 2088లతో కలిపి మొత్తం 13 వేల 421 వివిధ రకాల అనుమతులను జారీ ప్లానింగ్ విభాగం అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్లానింగ్ విభాగం ఆదాయం గత ఆర్థిక సంవత్సరం ఆదాయంతో పోల్చితే ఆశించినంత స్థాయిలో పెరగలేదనే చెప్పవచ్చు. ఆర్థిక సంవత్సరం (2023 24) లో ప్లానింగ్ ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 1107.29 కోట్ల ఆదాయం సమకూరగా, ఇటీవలే మార్చి నెలాఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరం (202425) లో రూ.1138.44 కోట్లు సమకూరింది. అంటే గతేడాదితో పోల్చితే ఈ సారి ప్లానింగ్ ఆదాయం కేవలం రూ. 31.15 కోట్లు మాత్రమే పెరిగింది. 202021 ఆర్థిక సంవత్సరం నుంచి గడిచిన అయిదేళ్లలో ప్లానింగ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గమనిస్తే అత్యధికంగా ఆదాయం ఆర్థిక సంవత్సరం (202223) లో అత్యధికంగా రూ.1454.76 కోట్లు కాగా, అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (202122) లో రూ.1144.08 కోట్లు రాగా, ఆర్థిక సంవత్సరం (202425)లో ఈ ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.1138.44కోట్లు వచ్చింది. అంటే గడిచిన 2022, 2023, 2024 సంవత్సరాల్లోని ఆదాయాన్ని విశ్లేషిస్తే గ్రేటర్ సిటీలో నిర్మాణ కార్యకలాపాలు స్వల్పంగా తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి.

# హెచ్‌సీఏలో భారీ అవినీతి

మొదటి పేజీ తరువాయి



చూస్తున్నాడని, ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడానికే జగన్ మోహన్ రావు చేస్తున్నాడని ఆరోపించారు. హెచ్ సి ఏ అధ్యక్షుడు జగన్మోహన రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో యూత్ కాంగ్రెస్ నాయకులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

**టికెట్ల పంపిణీలో వివాదం..**

తమిళనాడుకు చెందిన సన్ నెట్ వర్క్ యాజమాన్యంలోని సన్ రైజర్స్ ఫ్రాంచైజీ ఐపీఎల్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి హైదరాబాద్‌ను తమ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకొని ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌లు ఆడుతున్నది. ఐపీఎల్ టైమ్‌లో ఉప్పల్ స్టేడియాన్ని రెంట్‌కు తీసుకుంటున్నది. ఇందుకు ప్రతి మ్యాచ్‌కు హెచ్‌సీఏకు రూ.కోటి చెల్లిస్తున్నది. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాలను సన్ రైజర్స్ ఫ్రాంచైజీనే చూసుకుంటున్నది. స్టేడియం కెపాసిటీ 39 వేలు కాగా.. ఇందులో పది శాతం అంటే 3,900 టికెట్లను కాంప్లిమెంటరీ పాసుల రూపంలో హెచ్‌సీఏకు ఉచితంగా ఇస్తున్నది.వీటిలో రూ. 750 కనీస ధర టికెట్ల నుంచి రూ. 20 వేలు విలువ చేసే అన్ని సౌకర్యాలతో కూడిన కార్పొరేట్ బాక్స్ పాసులు కూడా ఉంటాయి. కార్పొరేట్ బాక్సు పాసుల కేటాయింపు విషయంలో సన్ రైజర్స్‌కు, హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లకు మధ్య విభేదాలు వచ్చాయి. ఉప్పల్ స్టేడియం సౌత్ స్టాండ్ ఫస్ట్ ఫ్లోర్‌లోని ఎఫ్-12ఏ బాక్సులో గత పదేండ్ల నుంచి హెచ్‌సీఏకు సన్ రైజర్స్ 50 టికెట్లు కేటాయిస్తున్నట్టు చెబుతున్నది. కానీ, ఆ బాక్స్ కెపాసిటీ 30 సీట్లు మాత్రమే అని హెచ్‌సీఏ అంటున్నది. కాబట్టి మిగతా 20 టికెట్లు వేరే బాక్సుల్లో సర్దుబాటు చేయాల్సిందిగా ఈ సీజన్ ముందుగానే రిక్వెస్ట్ చేయగా..సన్ రైజర్స్ ఫ్రాంచైజీ ఒప్పుకున్నది. అయితే, గత రెండు మ్యాచ్ లలో ఆ బాక్సుకు 50 టికెట్లు కేటాయించినట్టు చెబుతున్నది. ఈ నెల 27న లక్నో మ్యాచ్ సందర్భంగా ఈ విషయంపై ఇరు వర్గాల మధ్య వివాదం ముదిరింది. ఇతర బాక్సుల్లో 20 టికెట్లు కేటాయించాలంటూ పట్టుబట్టినా వినకపోవడంతో ఎఫ్3 బాక్సుకు హెచ్‌సీఏ తాళం వేసింది. దాన్ని లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకకు కేటాయించడంతో హెచ్‌సీఏ పెద్దలు కావాలనే తమను బ్లాక్‌మెయిల్ చేశారంటూ సన్ రైజర్స్ ఫ్రాంచైజీ శ్రీనాథ్ ఈ మెయిల్ లో ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది.



# హెచ్‌సీయూ భూములపై.. ముదురుతున్న వివాదం

మొదటి పేజీ తరువాయి

దశలో పోలీసులు విద్యార్థులపై దాడికి దిగారు. స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు విద్యార్థులను చితక బాదారు. ఎక్కడికి వెళ్లకుండా తాళ్లతో అడ్డుకుని వారిపై విచక్షణా రహితంగా దాడి చేశారు.

**400 ఎకరాలపై నివేదిక కోరిన కేంద్రం..**

హెచ్‌సీయూ భూముల వివాదంపై రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ శాఖ బిగ్‌ట్విస్ట్ ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కంచె గచ్చిబౌలి గ్రామంలో అక్రమంగా వృక్షాలను నరికివేయడం, తొలగించడంపై రాష్ట్ర అటవీ శాఖకు లేఖ రాసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలిగించారని, వన్యప్రాణులు, సరస్సులు, పురాతన రాతి నిర్మాణాలకు నష్టం కలిగించారని వివిధ వార్తా పత్రికల్లో కథనాలు వెలువడినట్లు పేర్కొంది. ర్యావరణానికి విఘాతం కలిగించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అంతేగాక ఇకపై వివాదానికి తావు లేకుండా.. యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించింది. అక్కడ చెట్లు, జంతుజాలానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రానికి కేంద్రం సలహా ఇచ్చింది. ఈ వ్యవహారంలో నిజా నిజాలపై విచారణ సాగించి, పూర్తి నివేదికను అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరింది. కోర్టులు, ట్రిబ్యునల్స్ గతంలో ఇచ్చిన ఆదేశాల ఉల్లంఘన లేకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది.

చెట్ల నరికివేత ఆపాలని హైకోర్టు ఆదేశాలు.. నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం..కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

**చెట్లు పెరిగితే అడవి అవుతుందా: మంత్రి జూపల్లి**

హెచ్‌సీయూలో ఒక్క ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదని.. 400 ఎకరాల భూమి వెనక పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఒక ప్రైవేట్ కంపెనీకి భూమి దక్కకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడింది. దానికి 400 ఎకరాలు వెళ్తే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది అనిపించలేదు. చెట్లు పెరిగితే అడవి అయిపోతుందా? 20 ఏండ్ల నుంచి పడావుగా ఉన్న భూమిలో చెట్లు పెరుగుతాయి కదా. హెచ్‌సీయూలో పులులు, జింకలను ఇబ్బంది పెడుతున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తపన పడుతున్నారు. భూమి తీసుకున్నందుకు భూమిని యూనివర్సిటీకి ఇచ్చారు' అని తెలిపారు.

# గులాబీ జెండా సత్తా చాటాలి

మొదటి పేజీ తరువాయి



సమావేశం అయ్యారు. కేటీఆర్, హరీష్ రావుతో పాటు సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా కీలక నేతలు హాజరయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశం పెట్టుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి లక్ష మందికి తగ్గకుండా లక్షలాది మందితో సభ నిర్వహించేలా ప్లాన్ ఉండాలన్నారు. ఆ దిశగా ఫామ్ హౌస్‌కు చేరుకుంటున్న బీఆర్ఎస్ మాజీ తాజా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ లు. ముఖ్య నేతలకు కేసీఆర్ సూచనలు చేస్తున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారు..? కాంగ్రెస్ పాలన.. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు ఏం చర్చించుకుంటున్నారు...? స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ పార్టీ పరిస్థితి..? తదితర అంశాలపై బీఆర్ఎస్ నాయకులను మాజీ సీఎం కేసీఆర్ ఆరా తీశారు. స్వరాష్ట్రం సాధనే ధ్యేయంగా పురుడు పోసుకున్న గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జయప్రదం చేయాలని దిశానిర్దేశం చేశారు. కారు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని పార్టీ శ్రేణులకు అధినేత మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం తో గులాబీ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఉద్యమాల పురిటి గడ్డ నుంచి భారీ స్థాయిలో జన సమీకరణే ధ్యేయంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన పుష్కర కాలం తరువాత అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కలిగించడమే ధ్యేయంగా కారు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సన్నద్ధం అవడం గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది.

# ఎల్ఆర్ఎస్‌కు మరో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి




క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును పొడిగించింది. ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రజలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది ప్రభుత్వం. మొదట మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం మేర రాయితీ ప్రకటించారు. అయితే ఈ గడువు ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్న మేర స్పందన కూడా రాలేదు. దీనిలో భాగంగానే.. మరోసారి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించింది.

**ఒక్కరోజే రూ.124 కోట్ల ఆదాయం..**

ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు. పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. దీనిని అధికారులు పరిష్కరించేలోపే గడువు తేదీ సమీపించింది. దీంతో వరుసగా ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో చివరి రెండు రోజులు కార్యకలాపాలు సాగలేదు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తడంతో.. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్‌ను మరో నెల రోజులు పొడిగించింది. 202425 ఆర్థిక సంవత్సరం చివరి రోజున అంటే మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద దాదాపు రూ.124 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారాలు తెలిపారు. అయితే ఈ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నేడు నిర్ణయం తీసుకోగా.. ఏప్రిల్ 1వ తేదీన కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.

# జపాన్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేల్‌పై 6.2 తీవ్రత నమోదు
- ప్రపంచాన్ని వణికిస్తున్న వరుస భూకంపాలు
- శ్మశాన వాటికను తలపిస్తున్న మయన్మార్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

వరుస భూకంపాలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఇటీవల మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను భారీ భూకంపం గడగడలాడించిన విషయం తెలిసిందే. ఈ భూకంపం ధాటికి మయన్మార్ శ్మశాన వాటికను తలపిస్తోంది. దాదాపు 3 వేల మంది మరణించారు. ఇంకా వేల మంది శిథిలాల కింద చిక్కుకుని ఉండగా.. వారి కోసం సహకయ చర్యలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగానే.. బుధవారం (ఏప్రిల్ 2) జపాన్‌లోని క్యుషులో భారీ భూకంపం సంభవించింది.భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.2గా నమోదైనట్లు జపాన్ అధికారులు వెల్లడించారు. క్యుషులో భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపారు. ఒక్కసారిగా భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది.

కాగా, జపాన్‌లో భారీ భూకంపం సంభవించబోతుందని.. దీని ప్రభావంతో వేల సంఖ్యలో ప్రజలు చనిపోతారని జపాన్ ప్రభుత్వం ఇటీవల ఒక నివేదిక విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం చెప్పిన వారం రోజుల వ్యవధిలోనే జపాన్లో భారీ భూకంపం సంభవించడం గమనార్హం.



# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

- హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్

**విశాలభారతి,ఎల్కతుర్తి:**
బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండని హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. బుదవారం బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పైన వ్యతిరేకతతో జనం ఉన్నందున సభ భారీ ఎత్తున సక్సెస్ అవుతుందని సభ ప్రాంగణ పనులనబి ప్రారంభించారు. రాష్ట్రం నాలుగు మూలల నుంచి వచ్చే కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ సౌకర్యం అన్ని విధాల సౌకర్యాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ శాసనసభ్యులు సతీష్ కుమార్ మాట్లాడుతూ సభ కోసం భూములు ఇచ్చిన చింతలపల్లి రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు అందరూ కష్టపడి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీ కాంతారావు మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు శాసనసభ్యులు పళ్ళ రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి తక్కల్లపల్లి రవీందర్రావు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి. నరేందర్ చల్ల ధర్మారెడ్డి శంకర్ నాయక్ గ్యాదారి బాలమల్లు ఎక్స్ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ సింగిల్ విండో వైస్ చైర్మన్ శేషగిరి మాజీ ఎంపీపీ మేకల స్వప్న మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరీ స్వామి మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కడారి రాజు మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగెడ మహేందర్ రాష్ట్ర నాయకులు గోల్లె మహేందర్ మండల యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి సోషల్ మీడియా ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గుండేటి సతీష్ నేత మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్ బీసీ సెల్ మండల అధ్యక్షులు చెవుల తిరుపతి అంచనగిరి స్వామి ఆర్కె మహిళా నాయకులు భాగ్య తదితరులు పాల్గొన్నారు


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





vishalabharathi Telugu Daily


## సీసీ కెమెరాలు ఏర్పాటు

**ఆర్మూర్,విశాలభారతి:**
గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను నందిపేట్ మండలంలోని లక్కంపల్లి గ్రామంలో బుధవారం ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులను సిపి అభినందించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి గ్రామాలలో ప్రధాన కూడలిలలో మరియు పట్టణాలలో ఇండ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.





# వెన్నవరం ఆదర్శ్ రెడ్డికు బీఆర్ఎస్ పగ్గాలు

- పటాన్ చెరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ బాధ్యతలు
- నియమించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- ఉగాది వేళ కార్యకర్తలకు తీపి కబురు





**పటాన్ చెరు,విశాలభారతి**
బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గా రామచంద్రాపురం పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత వెన్నవరం ఆదర్శ్ రెడ్డి నియమితులయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శ రెడ్డికు బీఆర్ఎస్ బాధ్యతలను అప్పగించారు. నియోజకవర్గ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారోనని ఎదురు చూసిన పార్టీ నాయకులు, కార్యకర్తకుఉగాది పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తీపి కబురు అందించింది.ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభ విజయవంతం కోసం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకులను దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్ చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ గా నియమించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను జరిపేందుకు సన్నాహాలు గురించి చర్చించినట్టు ఆదర్శ్ రెడ్డి తెలిపారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశం పెట్టుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారని, గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరించాలని, జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని కేసిఆర్ సూచించినట్టు చెప్పారు. సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సర్దార్ సర్వాయి పాపన్నని స్ఫూర్తిగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట,విశాలభారతి:**
సమాజంలోని అన్యాయాలపై ధైర్య సాహసాలతో విరోచితంగా పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఫొటోకి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న సాహసాలు, మొఘల్ పాలకులతో చేసిన పోరాటాలు , పోరాటం ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఇప్పటికీ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.అప్పటి రోజుల్లో రాజ్యం స్థాపించేవారు సమాజం లోని అన్యాయాలను, అణచివేతను తొలగించి, సమాజం లో అందరికి సమన్యాయం చేస్తానని ప్రజలలో నమ్మకం కల్పించేవారని అలాంటి నమ్మకం ప్రజలలో సర్దార్ సర్వాయి పాపన్న కల్పించి రాజ్యంలను స్థాపించి సమ సమాజ స్థాపన కోసం కృషి చేసారని, మొఘల్ రాజైనా ఔరాంగజేబ్ కి వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న విరోచితంగా పోరాడి ప్రజల మన్ననలు పొందారని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ 10 మందికి సహాయం చేయాలని సమాజం లోని పేదరికం నిర్మూలించుటకై, సమాజం లో ప్రతి ఒక్కరికి సమానత్వం కల్పించుటకు అలాగే ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓపిడివివి అప్పారావు,జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్,లత, జగదీశ్వర్ రెడ్డి, కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




# రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరం.
- ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం.

**సూర్యాపేట,విశాలభారతి:**
రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సూచించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వాహన చోదకులకు రాంగ్ రూట్ ట్రాఫిక్ నిబంధనలు పలు వాటిపై ఎస్సై ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున రాంగ్ రూట్ ప్రయాణలు అసలు చేయవద్దని వాహన చోదకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవన్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.గత పది రోజుల్లో రాంగ్ ప్రయాణం చేసిన 150 మంది వాహన చోదకులకు జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు.



# హెచ్ సియు భూముల వేలాన్ని ఆపాలి

- అక్రమ కేసులు ఎత్తివేయాలి.
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కోలిశెట్టి యాదగిరిరావు

**సూర్యాపేట,విశాలభారతి:**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థుల మీద, సిపిఎం నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ400 ఎకరాల యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయవలసిన దశలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకుని అమ్మకానికి పెట్టింది. విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమిని అమ్మకానికి పెట్టవద్దని, యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ నాయకత్వంలో గత కొద్ది రోజులుగా విద్యార్థులు పోరాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించి అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని అక్రమ కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్, మేకన బోయిన శేఖర్, వీరబోయిన రవి, పులుసు సత్యం, సిపిఎం పార్టీ పట్టణ వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్

**సూర్యాపేట,విశాలభారతి:**
వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రంను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని అంజలీ స్కూల్ ఎదురుగా నిర్మల హాస్పిటల్ సమీపంలో సట్టు లక్ష్మీ జ్ఞాపకార్థం నేచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సట్టు నాగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు.నేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు.అనంతరం నేచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సట్టు నాగయ్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రంను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు తలమల్ల హసేన్, మట్టపల్లి సైదులు, వీరయ్య, మహేశ్వరి,చరణ్, మహేష్,జీవన్ ప్రసాద్,హరి ప్రసాద్, దయారత్నం, దేవయ్య, పురుషోత్తం, సైదమ్మ, పద్మ, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రజా చైతన్య యాత్ర

**విశాలభారతి, ఎల్కతుర్తి:**
హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలంలోని కేశ్వపూర్ గ్రామానికి... "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పాదయాత్ర చేసుకుంది. ముఖ్య అతిధిగా చైర్మన్ ఇనుగాలా వెంకట్రాం రెడ్డి టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రశేనా రెడ్డితో అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిది

**బాల్కొండ,విశాలభారతి:**
భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడుపై ఉందని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. బాల్కొండ మండలం కిసాన్ నగర్,ముప్కాల్ మండలం రెంజర్ల,మెండోర మండలం బుస్సాపూర్ గ్రామాలలో నిర్వహించిన జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు సమాన హక్కులను కల్పించిన,ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



### సిరాజ్ నిప్పులు.. బట్లర్ సిక్సర్లు

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:** ఐపీఎల్ 2025 లో గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం (ఏప్రిల్ 2) చిన్న స్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బౌలింగ్ లో సిరాజ్ నిప్పులు చెరగగా..ఆ తర్వాత ఛేజింగ్ లో బట్లర్( 39 బంతుల్లో 73:5 ఫోర్లు, 6 సిక్సర్లు) సాయి సుదర్శన్ (49) బ్యాటింగ్ లో అదరగొట్టారు. ఈ సీజన్ లో వరుసగా రెండు విజయాలు సాధించిన ఆర్సీబీ తొలి పరాజయాన్ని మూట కట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది.



## పేదవాడి ఆకలి తీర్చే ప్రభుత్వమే
# కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆత్మ గౌరవాన్ని పెంచేలా సన్న బియ్యం పంపిణీ.
- సంపన్నులే కాదు ప్రతి పేదవాడు సన్న బియ్యం తినాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.
- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.

**సూర్యాపేట,విశాలభారతి:**
పేదవాడి ఆకలి తీర్చే ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వమని ఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోతం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట మండలం కుప్పిరెడ్డిగూడెం,కేటీ అన్నారం, కాసరబాధ, కేసారం,ఇమాంపేట, సూర్యాపేట పట్టణంలో కుడ కుడ,దురాజ్ పల్లి రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పథకం పంపిణి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో ప్రజల హృదయాల్లో నిలిచిపోయి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని దీనివల్ల బడుగు బలహీన గిరిజన మైనార్టీ పేద ప్రజలకు మూడు పూటల కడుపు నింపే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందని త్వరలో 10 లక్షల మందికి రేషన్ కార్డులు అర్హులైన వారికి గృహాలు ప్రజా పాలనలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నారని దీని వల్ల పేదల అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన అన్నబియ్యం వృత్తిదారులు తీసుకొని తమ ఆనంద వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి పేదవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో రకంగా సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. సన్న బియ్యంతో ప్రతి పేద వాడి కళ్ళలో ఆనందం చూడగలుగుతున్నామని ఇది ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వమని పేదవారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, పందిరి మల్లేష్ గౌడ్, మద్దె బోయిన శ్రీనివాస్, అంజిరెడ్డి, వేములకొండ పద్మ, ఎలిమినేటి అభినయ్, తన్వీర్, చంచెల నిఖిల్ నాయుడు, నర్సింగ్ మహేష్ గౌడ్, రేషన్ డీలర్ లు గొర్ల గన్నారెడ్డి, శ్రీనివాస్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వం హామీపడ్డ 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి.
- ప్రొఫెసర్ రామయ్య షెఫర్డ్

**ఓయూ,విశాలభారతి:**
ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనిప్రొఫెసర్ రామయ్య షెఫర్డ్ పేర్కొన్నారు. బుదవారంఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్ రామయ్య షెఫర్డ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పోరాటంలో ఉన్న విద్యార్థి ఉద్యమకారులు తమ విలువైన సమయాన్ని, భవిష్యత్తును కోల్పోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే గడీల నిర్మాణమేమని, దశాబ్దకాలంలో అది నిరూపణ అయిందని, ఇవాళ తెలంగాణ సమాజానికి కావలసింది పునర్నిర్మాణం కాదు నవనిర్మానమని పేర్కొన్నారు. తెలంగాణ నవనిర్మానంలో విద్యార్థులది కీలక పాత్ర అని, భవిష్యత్తు తెలంగాణ నిర్మాణానికి విద్యార్థి యువకులే పూనుకోవాలని తెలిపారు. తక్షణమే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ పడ్డ 250 గజాల ఇంటి స్థలంతో పాటు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు అలాగే స్వయం ఉపాధి కి కావలసిన సబ్సిడీ రుణాలను అందించి, తెలంగాణ ఉద్యమంలో అమరులైన విద్యార్థి అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం జరిగే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 16 తేదీన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విద్యార్థి ఉద్యమకారుల సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారుల పోరాటానికి ఎస్ఎఫ్ఐ సైతం మద్దతు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేతలు కంచర్ల బద్రి,ఎం.పీ. వీరస్వామి, పాల్వాయి నగేష్,ఈరెటి విజయ్ మాదిగ, మంద నాగేష్ పి డి ఎస్ యు, ఎన్. సైదులు (హంస), ఏ . భగత్ ఏఐఎస్ఎఫ్, కరణ్ ఎల్ ఎఫ్ టి, జి. విజయ్ నాయక్ టిడిఎస్ఎఫ్, కే ఆనంద్ పి ఎస్ యు, కే. రమేష్ యాదవ్ వి జె ఎస్, ఉదయ్ ఏఐఎస్ఎఫ్ పాల్గొన్నారు.





## జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్ర ప్రారంభం

**బాల్కొండ,విశాలభారతి:**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమం బాల్కొండ ఇంచార్జ్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.ఈ పాదయాత్ర చెంగల్,బడా భీంగల్,రూప్లతండా,మూడు గుడిసెల తండా, గోన్ గోప్పుల,సికింద్రాపుర్ గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహత్మ గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యంగంపై ప్రజల్లో అవగాహన కల్పించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోదిరే స్వామి,పట్టణ అధ్యక్షుడు జె.జె నర్సయ్య,బిసి సెల్ అధ్యక్షుడు కోరడి రాజు ,ఎస్సి సెల్ అధ్యక్షుడు అనంతరావు,ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు నాగేంద్ర,బాల్కొండ నియోజకవర్గం యువజన అధ్యక్షుడు చరణ్ గౌడ్,మండల యువజన అధ్యక్షుడు అవినాష్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించని భవిష్యా
# వెల్ విషర్ హాస్పిటల్ పై చర్యలు

- తక్షణం 5,00,000 జరిమాన
- హాస్పిటల్ రిజిస్ట్రేషన్ 60 రోజులు సస్పెండ్
- హాస్పటల్ ప్రాంగణాన్ని స్వాధీనం

**బోడుప్పల్ , విశాలభారతి:**
అనుమతి లేకుండా నడిపిస్తున్న భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్ పై బుదవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా సేవలను ప్రకటన చేయడం, మెడికల్ డైరెక్టర్ లేకపోవడం, సిబ్బందిని నియమించడం,అధిక శక్తి కలిగిన వైద్య మాత్రలు తప్పుడు వినియోగం, అనధికార వైద్య చికిత్సలు, మరియు లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బందిని నియమించకపోవడంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలోని భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్ పై తీవ్రమైన చర్యలు తీసుకున్నట్లు వైద్య అధికారులు చర్యలు తీసుకొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సి ఉమా గౌరీ ,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. గీతా, మరియు అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. వినోద్ ,రెవిన్యూశాఖ , పోలీసు అధికారుల సమక్షంలో బుదవారం హాస్పిటల్ లోని అనేక నియమ ఉల్లంఘనలను గుర్తించారు. ఈ ఉల్లంఘనల ఆధారంగా, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల ప్రకారం తక్షణ చర్యలు ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5,00,000 జరిమాన విధించారు. అదనంగా హాస్పిటల్ రిజిస్ట్రేషన్ 60 రోజులపాటు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.



## ఎస్ఆర్ కె లీడ్ స్కూల్
# వార్షికోత్సవ హంగామా

- ఉల్లాసంగా చిన్నారుల ఆట - పాట

**విశాలభారతి,భీమదేవరపల్లి:**
భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ఎస్ఆర్ కె లీడ్ పాఠశాలలో 15వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర నాయకులు యాదగిరి శేఖర్ రావు, ఏకేవీఆర్, ఆర్డీఎస్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. వేదికపై చిన్నారుల ఆట పాటలు, కేరింతలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీతారాణి, పివి మదన్ మోహన్ రావు, ఎస్ ఆర్ కె లీడ్ ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆరోగ్యసమస్యలతో బాధపడుతూ
# మహిళ ఆత్మహత్య

**విశాలభారతి, అడ్డగూడూర్ :**
అడ్డగూడూర్ మండలానికి చెందిన ఓ మహిళ అనారోగ్యం కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, మోత్కూరు గ్రామానికి చెందిన ఆరే సతెమ్మ (55) అనారోగ్యంతో బాధపడుతుండడంతో గత కొన్ని నెలలుగా తన కుమార్తె పంగా రేవతి (25) ఇంట్లో ఉంటోంది. ఉగాది పండుగ సందర్భంగా ఏప్రిల్ 1న సతెమ్మ తన స్వగ్రామమైన మోత్కూరుకు వెళ్లి తిరిగి కుమార్తె ఇంటికి చేరుకుంది. అయితే, ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో పాటు మానసిక స్థితి కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సతెమ్మ చీరతో ఇంటి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత ఆమె



మనవడు శశాంత్ స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తన అమ్మమ్మ ఉరేసుకుని కనిపించడాన్ని గమనించి పెద్దగా అరిచాడు. వెంటనే స్థానికులు వచ్చి ఆమెను కిందికి దించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. అనారోగ్య పరిస్థితుల కారణంగా, మానసిక ఒత్తిడికి గురై ఆమె ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు పంగ రేవతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై అడ్డగూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ డి నాగరాజు విలేకరులకు తెలిపారు.



# అబ్దుల్లాపూర్మెట్ లో బర్డ్ ఫ్లూ కలకలం

- బాట సింగారంలోని సాయి గణేష్ పౌల్ట్రీ ఫామ్ లో బార్డ్ ఫ్లూ

**పెద్ద అంబర్ పెట్,విశాలభారతి:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రంలోనీ బాటసింగారం గ్రామం చెందిన సాయి గణేష్ పౌల్ట్రీ ఫార్మ్ నందు బర్డ్ ఫ్లూ కలకలం రేపుతుంది. బుధవారం నగర శివారులోని పౌల్ట్రీ ఫార్మ్ బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణ జరగడంతో అబ్దుల్లాపూర్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వణికి పోతున్నారు. గతవారం నుండి రోజుకి సుమారు 1500 కోళ్లు చనిపోతున్నాయని ఫామ్ యాజమాన్లు తెలిపిన సమాచారంతో అధికారులు పౌల్ట్రీ ఫార్మ్ వద్దకు చేరి అక్కడి శాంపిల్స్ ను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పౌల్ట్రీ ఫార్మ్ వద్ద చనిపోయిన కోళ్ల యొక్క శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించారు. బుధవారం అది బర్డ్ ఫ్లూ అని తేలడంతో పౌల్ట్రీ ఫార్మ్ ని అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.అనంతరం పౌల్ట్రీ ఫార్మ్ మొత్తం ప్రత్యేకమైన కెమికల్స్ తో శానిటైజ్ చేస్తున్నామని,చుట్టుపక్కల ప్రాంతాన్ని రెడ్ జోన్ గా ప్రకటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలిపామని అన్నారు. అలాగే పౌల్ట్రీ ఫామ్ లో పనిచేసే కార్మికులకు కూడా రక్త పరీక్షలు చేసే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి వచ్చే మూడు నెలల వరకు సంబంధిత పౌల్ట్రీ ఫామ్ పూర్తిగా మా ఆధీనంలో ఉంటుంది అని ఫామ్ లో ఎటువంటి వైరస్ లేదని గుర్తించాక మాత్రమే మళ్లీ ఓపెన్ చేసే అవకాశం ఉంటుందని అన్నారు.

## ప్రజలు మమేకమై ఉండడం కొరకే పోలీస్ ప్రజాభరోసా

- ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి
- సిఐ చరమందరాజు

**గరిడేపల్లి, విశాలభారతి:**
పోలీసులతో ప్రజలు మమేకమై ఉండడం కొరకే పోలీస్ ప్రజా భరోసా అని సిఐ చరమందరాజు అన్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆదేశాల మేరకు మండలంలోని పోనుగోడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు యువత చెడు అలవాట్లకు పాల్పడకుండా ఉండాలని తెలిపారు. యువత పోలీస్ రికార్డులలో ఒక్కసారి పేరు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు,విదేశాలకు వెళ్లే విషయంలో పాస్పోర్ట్, వీసా పొందే అనుమతులు ఉండవని ఎప్పటికీ అలాగే నిలిచిపోతుందన్నారు. మహిళలను వేధిస్తే కేసులు నమోదు చేసి జీవితకాలం శిక్ష పడేలా పోలీస్ దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గ్రామానికి ఒక విలేజ్ పోలీస్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపద్దని చిన్నపిల్లలకు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలని, గంజాయి,మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ లాంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దని తెలిపారు. సైబర్ మోసాలకు గురి కాకుండా బెట్టింగ్ ప్రకటనలు నమ్మి డబ్బులు బెట్టింగ్ పెట్టి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవద్దని తెలిపారు. నేరాలుఘోరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు తెలుపవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి హుజూర్నగర్ పాలకీడు మఠంపల్లి ఎస్సైలు చలిగంటి నరేష్, ముత్తయ్య, లక్ష్మీనరసయ్య, బాబు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# డిఎస్పి రవిని సస్పెండ్ చేయాలని ధర్నా

**నూతనకల్, విశాలభారతి:** సూర్యాపేట మాజీ డిఎస్పి రవిని సస్పెండ్ చేయాలని నూతనకల్ మండల కేంద్రంలో దంతాలపల్లి సూర్యపేట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చక్రయ్య హత్య కేసులో సస్పెండ్ అయిన డిఎస్పి రవి కుమార్ ని ఐజి కార్యాలయానికి అటాచ్ చేసినప్పటికీ తిరిగి డిప్టేషన్ మీద సూర్యాపేట జిల్లాకు రప్పించడానికి వ్యతిరేకంగా మిర్యాల గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. డిఎస్పి రవికుమార్ ను సస్పెండ్ చేయాలని కోరుతూ చక్రయ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు డీఎస్పీ డాం..డాం అని భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. కిలోమీటర్ మేర వాహనాలు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో, ఇన్చార్జి సిఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై మహేంద్రానాథ్ లు పై అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో చక్రయ కుటుంబ సభ్యులు ధర్నాను విరమించారు.



# కామ్రేడ్ రేణుక భౌతికదేహానికి నివాళులర్పించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పల, విశాలభారతి:** ఛత్తీస్ ఘడ్ లోని దంతే వాడ ఎన్కౌంటర్ లో అసువులు బాసిన దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామంలో మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ నాయకురాలు కామ్రేడ్ గుమ్మడవెల్లి రేణుక అలియాస్ మిడ్కో, అలియాస్ భాను,అలియాస్ దమయంతి, చైతే భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించిన దేవరుప్పుల పిపిసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్.అంతే కాకుండా వారి భౌతిక దేహాన్ని బంధుమిత్రుల కమిటీ నాయకులు,విరసం నాయకులు,మాజీ మావోయిస్టు నేత గాద ఇన్నయ్య,పౌర హక్కుల,మానవ హక్కుల సంఘం నేతలు,గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు.



# అత్యాచార భాధితురాలకు న్యాయం చేయాలి

**శాలిగౌరారం, విశాలభారతి:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం లోని ఊర్కొండ లో వివాహిత పై జరిగిన దారుణమైన అత్యాచారాన్ని బి ఎస్ పి తీవ్రంగా ఖండిస్తోందని బి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్ అన్నారు.బుధవారం అయన శాలిగౌరారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ దైవ దర్శనానికి వెళ్లిన మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందుతులందరికీ కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం లో అధికారులు మరింత వేగవంతమైన సమగ్ర దర్యాప్తు చేయట్టాలన్నారు. భాదిత మహిళకు తగిన న్యాయం జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో వేముల లక్ష్మణ్, రజిత, బొడ్డు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫోటో ఉండాలి

**నేరేడుచర్ల, విశాలభారతి:** బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజున పట్టణ బిజెపి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని పలు రేషన్ షాపులను ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసే సమయంలో వెళ్ళి పరిశీలించి,అన్ని రేషన్ షాపుల వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం మోడీ ఫ్లెక్సీని , తగిన సైజులో, ప్రజలకు కనపడేలా పెట్టాలని,లేకపోతే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవింగా ప్రతి వ్యక్తి తీసుకునే 6 కేజీల సన్నబియ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా కేవలం 1 కేజీ మాత్రమేనని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం 5 కేజీలు సన్నబియ్యం ఇస్తున్నదని, డబ్బు రూపంలో చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం వాటా కేజీకి కేవలం 10 రూపాయిలు మాత్రమేనని, అదే కేంద్ర ప్రభుత్వం అయితే ఒక కేజీకి 40 రూపాయలు ఇస్తున్నదని,కనుక ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే అబద్దాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని,త్వరలో రాబోవు సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్ళకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని, నియోజకవర్గంలో ఉన్న ప్రతి బిజెపి బూత్ అధ్యక్షులు ప్రతి రేషన్ షాపుకి వెళ్లి ఒక వ్యక్తికి ఇచ్చే 6 కేజీల బియ్యం లో కేంద్రం ఇస్తున్న 5 కేజీల గురించి ప్రజలకి తెలిసేలా కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.

## సన్న బియ్యం పంపిణీ చేసిన మాజీ కౌన్సిలర్



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలో గల 14వ వార్డులో రేషన్ షాప్ నెంబర్ 41 చౌక ధరల దుకాణం వద్ద సన్న బియ్యం పంపిణీ కార్యక్రమన్ని తాజా మాజీ వార్డు కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ ప్రారంభించడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని పేద ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉండే ప్రభుత్వం అని అందులో భాగాంగానే సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ప్రారంభించిండం జరిగిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వర్కాల రవి ,పబ్బు శ్రీకాంత్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్



**నర్సింహులు పేట, విశాలభారతి:** మండలంలో వంతడపుల, పెద్ద నాగరం,కొమ్మూలవంచ, రామన్న గూడెం గ్రామంలోని సన్న రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభిస్తూ డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామ్ చంద్రు నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం చేరాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వం డాక్టర్ రామ్ చంద్రు నాయక్ పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని,రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మందికి ఆరు కిలోల సన్నబియ్యం అందజేస్తామని. అందుకు ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందనీ అన్నారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకమనీ వారు కొనియాడారు.పేదలు దొడ్డు బియ్యం తినలేరనీ. పీడీఎస్ బియ్యాన్ని మిల్లర్లు, దళారులు సైక్లింగ్ చేస్తున్నారనీ. ఈ నేపథ్యంలోనే ప్రతి పేద వారి కడుపు నింపాలన్న లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించామని. పథకాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పకడ్బందీగా అమలు చేసి పేదవారికి అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో యాకయ్య, డిప్యూటీ తాసిల్దార్ సుధాకర్ నాయక్, స్థానిక రక్షణ శాఖ అధికారి ఎం సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, లింగారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు చిర్ర సతీష్ గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ రజినీ కాంత్ రెడ్డి, సి ఎస్ టి బి సి మైనార్టీ సెల్ అధ్యక్షులు వెంకన్న గౌడ్, మెహబూబ్ ఖాన్, దసరు నాయక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొన్నం శ్రీకాంత్, రఫీ, వెంకట్ రెడ్డి, సోమలింగం కార్యకర్తలు పాల్గొన్నారు.



# కేసీఆర్ పదేళ్లలో ఒక్క ఎన్కౌంటర్ కూడా చేయించలేదు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**దేవరుప్పల, విశాలభారతి:** ఛత్తీస్ ఘడ్ లోని దంతే వాడ ఎన్కౌంటర్ లో అసువులు బాసిన దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ నాయకురాలు కామ్రేడ్ గుమ్మడవెల్లి రేణుక భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,జనగామ నియోజక వర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో వెట్టిచాకిరి విముక్తి కోసం ఏవిధంగా పోరాడారో ఆ తర్వాత నక్సల్స్ ఉద్యమంలో కూడా దున్నేవాడికే భూమి అనే నినాదంతో ప్రజలందరూ క్షేమంగా ఉండాలని తమ ప్రాణాలను లెక్కచేయకుండా రేణుకక్క 35 సంవత్సరాల క్రితం లా చదివి గోల్డ్ మెడల్ సంపాదించినా కూడా అందరికంటే మంచిగా బతికినా కూడా ఈ బతుకులు నాకొద్దని పేదప్రజల బతుకులకోసం ఉద్యమంలో ఉంటానని అడవిబాట పట్టిందని, తెలంగాణ వచ్చినంక ఒక్క ఎన్కౌంటర్ కూడా జరగలేదని, కేసీఆర్ ఎన్కౌంటర్ చేయించలేదని, ఈ ప్రాంతంలో ఎన్కౌంటర్ జరుగకుండా ఉండాలని,పది సంవత్సరాలలో ఒక్క ఎన్కౌంటర్ కూడా జరగలేదు ఇప్పుడుకూడ జరగొద్దని,దీన్ని మేము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.



# మావోయిస్టు నేత రేణుకకు అంతిమ వీడ్కోలు

**దేవరుప్పల, విశాలభారతి:** పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అడవి బాట పట్టి విప్లవోద్యమంలో అసువులు బాసిన మావోయిస్టు స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ సరస్వతి అంతిమ సంస్కారాలు ముగిశాయి. చత్తీస్గడ్ ఎన్కౌంటర్ లో ఆమె మృతి చెందగా అర్ధరాత్రి కడవెండి గ్రామానికి చేరుకున్న రేణుక మృతదేహాన్ని చూసి గ్రామ ప్రజలంతా కన్నీటి పర్యంతమయ్యారు, బుధవారం రేణుక మృతదేహాన్ని విప్లవ సంఘాల ప్రజా సంఘాల నాయకులు, విప్లవ రచయితల సంఘం నాయకులు, మాజీ మావోయిస్టులు, ఘనంగా నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో గుమ్మడవెల్లి రేణుక మృతితో ఉద్యమాల పురిటి గడ్డ కడవెండి గ్రామం మరోమారు ఎరుపెక్కింది తెలంగాణ సాయుధ పోరాటం నుండి మొదలుకొని నేటి వరకు జరిగిన పోరాటాలలో ఎంతోమంది ఉద్యమకారులు మృతి చెందారు గుమ్మలవెల్లి రేణుక ఉన్నత విద్యలో గోల్డ్ మెడల్ సాధించినప్పటికీ భూమి కోసం భుక్తి కోసం సమ సమాజ స్థాపన కోసం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అడవి బాట పట్టి అగ్రనేతల సరసన చేరింది రేణుక. ఈ దహన కార్యక్రమంలో దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి నాయకులు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.

# జగన్నాథ్ తండాలో రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీళ్లు

- డ్రైనేజీ నీళ్లు పొలాలలోకి రాకుండా అడ్డుకట్ట



**నేరేడుచర్ల, విశాలభారతి:** మండలంలోని జగన్నాథ్ తండాలో డ్రైనేజీ నీళ్లు బయటకెళ్ళిపోకుండా అడ్డుకట్టలు వేయడంతో రోడ్డుపై మురికి నీళ్లు నిలిచి ఇబ్బందికరంగా ఉందని తండావాసులు రమావత్ సైదా, రమావత్ రవీందర్, శ్రీరాములు, వాలియా, బాలు శివ తదితరులు తెలిపారు. గతంలో డ్రైనేజీ మురికి నీళ్లు వరి పొలాలకు వెళ్ళటంతో ఇబ్బంది లేకుండా ఉండేదన్నారు. ప్రస్తుతం రైతులు తమ పొలాలలోనికి డ్రైనేజీ మురికి నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేయటంతో ఇండ్ల ముందు సీసీ రోడ్డుపై,మురికి నీళ్లు నిలువ ఉండి దుర్గంధం వస్తుందన్నారు. డ్రైనేజీ కాలువ నుండి మంచినీటి పైపులు వెళ్తున్నాయని, అవి పగిలి వాటిలోకి డ్రైనేజీ నీళ్లు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. డ్రైనేజీ మురికి నీళ్లు తాగునీటి పైపుల్లో కలుస్తే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని విచారం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు డ్రైనేజీ కాలువను తీసి మురికి నీళ్లు లేకుండా చూడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వివరణ:ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా డ్రైనేజీ కాల్వ చివరి వరకు మంజూరు అయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గతంలో డ్రైనేజీ మురికి నీళ్లు వరి పొలాలకు వెళుతుంటే అభ్యంతరం చెప్పలేదని, ఇప్పుడు డ్రైనేజీ నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నారని చెప్పారు.



# చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే మందుల సామేలు

**శాలిగౌరారం, విశాలభారతి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో చివరి గింజ వరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. బుధవారం శాలిగౌరారం మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పి ఎ సి ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ రైతలు నాణ్యమైన ధాన్యం ను దళారులకు విక్రయించకుండా మార్కెట్ కు తీసుక వచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. చివరి గింజ వరకు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దేశం లో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్టంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్ డి ఓ యానాల అశోక్ రెడ్డి,తహసీల్దార్ పి. యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి లక్ష్మి,శాలిగౌరారం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ నరిగె నర్సింహా, సింగల్ విండో ఛైర్మెన్ తాళ్లూరి మురళి,వైస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, పి ఏ సి ఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు ,మార్కెట్ కమిటీ కార్యదర్శి చీనానాయక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్,సింగల్ విండో వైస్ ఛైర్మెన్ సీఎం రెడ్డి,మండల వ్యవసాయధికారి సౌమ్య శృతి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గైగుళ్ల అవిలయ్య,కుతాటి సోమయ్య,తాందారి సత్తయ్య,దేవరకొండ జయరాజ్,షేక్ లతీఫ్,బోడ దానయ్య తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం,
03.14.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## కబడ్డీ క్రీడాకారుడుని అభినందించిన ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్ చెరు,విశాలభారతి

కబడ్డీ క్రీడా పోటీలో అద్భుతమైన ప్రతిభ చూపిస్తూ రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారుని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అభినందించారు. అమీన్ పూర్ మున్సిపాలిటీకి చెందిన సారా అర్జున్ ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించి..రాష్ట్ర స్థాయి కబడ్డీ కబడ్డీ శిక్షణకు ఎంపికయ్యారు. తన విజయానికి సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని యువ క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారుడు పండు, తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని ముగ్గురు పిల్లల్ని చంపిన కన్న తల్లి..

- పోలీసుల అదుపులో హంతకురాలు రజిత, ప్రియుడు సూరు శివ కుమార్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్ చెరు,విశాలభారతి

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని ముగ్గురు పిల్లలని ఊపిరాడకుండా చంపేసింది..ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. రజిత @ లావణ్యకు ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం చదువుతున్న సమయం (2013)లో తనకన్నా వయస్సులో 20 సంవత్సరాలు పెద్ద వాడైన అవురి చింతల చెన్నయ్యతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సాయి పిల్లలు కృష్ణ(12), మధుప్రియ(10) గౌతమ్(8) ఉన్నారు. వీరి స్వస్థలం మెధక్ పల్లి గ్రామం, తలకొండపల్లి మండలం రంగారెడ్డి జిల్లా. గత 3సంవత్సరాల క్రితం నుంచి అమీన్ పూర్ పరిధిలోని బీరంగూఢ, రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్ గా, రజిత @ లావణ్య ప్రైవేట్ స్కూల్ టీచర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు 6 నెలల క్రితం రజిత @ లావణ్య 10వ తరగతి క్లాస్మేట్స్ అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకుందామని ప్లాన్ చేసుకుంటున్న సమయంలో తన 10వ తరగతి క్లాస్ మేట్ అయిన శివతో స్నేహం ఏర్పడి రోజు చాటింగ్, కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడేవారు. చాలా సార్లు శారీరకంగా కూడా కలవడం జరిగింది. రజిత @ లావణ్యకు, చెన్నయ్యకు ఎక్కువ ఏజ్ గ్యాప్ ఉండడం వల్ల మొదటి నుండే రజితకు చెన్నయ్య అంటే ఇష్టం ఉండేధి కాదు, తరచూ గొడవలు పడేవారు. శివ కలిసినప్పటి నుండి రజిత జీవితం ఆనందంగా ఉందని, శివకు పెళ్లి కాకపోవడంతో ఎలాగైనా అతన్ని పెళ్లి చేసుకుని జీవితాంతం సుఖంగా ఉండాలని భావించి పెళ్లి చేసుకోమని శివను అడిగింది. రజిత పిల్లలు లేకుండా ఒంటరీగా తనతో వస్తానంటే ఖచ్చితంతా పెళ్లి చేసుకుంటా అని చెప్పడంతో, శివను పెళ్లి చేసుకోవాలంటే పిల్లల అడ్డు తొలగించుకోవాల్సిందే అని నిర్ణయించుకుంది. గత నెల 27 సాయంత్రం 6 గంటలకు పిల్లలను చంపేస్తాను అని శివకు చెప్పగా ఆ పని చేయాలని అన్నాడు. అదే రోజు రాత్రి తన భర్త భోజనం చేసి రాత్రి 10 గంటలకి ట్యాంకర్ తీసుకొని చందానగర్ వెళ్ళగా అదే మంచి సమయం అని భావించిన రజిత, మొదటగా పెద్ద కొడుకు సాయికృష్ణను, కూతురు మధుప్రియ ఆతర్వాత చిన్న కొడుకుని గౌతమ్ ను ఇలా ముగ్గురిని ఒకరి తరువాత ఒకరిని ముక్కు, మూతిపై టవల్ వేసి, చేతితో గట్టిగా అధిమి పట్టుకొని, ఊపిరాడకుండా చేసి, చంపివేసినట్లు విచారణలో తేలింది. ఏ1, ఏ2 లు కుట్ర పన్ని పిల్లల్ని అడ్డు తొలగించుకోవాలని ఏ2 ప్రొత్సహించగా ఏ1 అత్యంత కిరాతకంగా ముగ్గురు పిల్లలను ఊపిరాడకుండా చేసి చంపివేసిందని, నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. సమావేశంలోపటాన్ చెరు డియస్పీ రవీందర్ రెడ్డి, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ నరేష్, పటాన్ చెరు డిఐ రాజు ఇన్స్పెక్టర్, అమీన్ పూర్ ఎస్ఐలు సోమేశ్వరి తదితరులు ఉన్నారు.





## శ్రీ మహా చండీ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులు

పటాన్ చెరు,విశాలభారతి

పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తన సతీమణి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాతో కలిసి పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సేవకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

**ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న కాట..**

పటాన్చెరు మండలం కర్దనూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బీరంగూడ గుట్ట ఆలయం చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## పదవీ ప్రమాణస్వీకారం చేసిన కూకట్పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కూకట్పల్లి,విశాలభారతి:

కూకట్పల్లి కోర్టు బార్ సోసియేషన్ కు గత నెల 27న జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికైన పి గోవర్ధన్ రెడ్డి మొదటగా పదవీ ప్రమాణం చేశారు. కాగా మొదటిసారి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కే భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏ సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎన్నికైన హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా ఎన్నికైన సైఫుల్ల షరీఫ్ ల చేత సీనియర్ న్యాయవాది రామచంద్రం పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన అఖిలారావు, సిహెచ్ అర్చన గౌడ్, కళ్యాణి,తన్నీరు శ్రీకాంత్, రామకృష్ణ, పద్మావతి,భాను ప్రకాష్ లు పదవి ప్రమాణం చేశారు. కోర్టులో వసతులను మరింత మెరుగు పరుస్తామని ,న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు తెలిపారు. తమ మీద నమ్మకంతో గెలిపించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరిని కలుపుకుపోతూ కూకట్పల్లి కోర్టు ఔన్నత్యాన్ని పెంచడానికి పాటుపడతామని, నిబంధనల మేరకు తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని తెలిపారు .కాగా ఎన్నికలను సజావుగా నిర్వహించిన చీఫ్ ఎన్నికల అధికారి సుభాష్ గుప్తతో పాటు సహాయ ఎన్నికల అధికారులను కూకట్పల్లి కోర్టు బార్ అసోసియేషన్ మెమొంటోలతో ఘనంగా సత్కరించింది.



## సూర్య నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:

హయత్ నగర్ డివిజన్లోని సూర్య నగర్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కమిటీ సభ్యులు బుదవారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని వారి నివాసంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రెండవసారి సూర్య నగర్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన యాదగిరి గౌడ్ కి మరియు కాలనీ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది, అదేవిధంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సూర్య నగర్ కాలనీలో ఏళ్లు తరబడి ఉన్న ప్రధాన రోడ్డు సమస్యను ఎంపీ ఈటల రాజేందర్ రెడ్డి సహాయ సహకారాలతో పరిష్కరించడం జరిగిందని, రానున్న రోజుల్లో కూడా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా మా యొక్క సహాయ సహకారాలు ఉంటాయని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూర్య నగర్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అయితగోని యాదగిరి గౌడ్ ,జనరల్ సెక్రటరీ యాదగిరి రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ దశరథ రెడ్డి ,సంపత్ కుమార్ ,యాదిగిరాచారి ,కోశాధికారి వెంకటయ్య గౌడ్ , అమృత రెడ్డి ,కోటి నాయక్ ,రాజ వర్ధన్ రెడ్డి , యాదగిరి , సుధాకర్ రెడ్డి ,భూపాల్ రెడ్డి , శంకర్ , రుద్ర కృష్ణ ,మల్లేష్ , వెంకటేష్ గౌడ్ ,వెంకట్ రెడ్డి తోపాటు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నాచారం,విశాల భారతి:


సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 315 వర్ధంతి కార్యక్రమాన్ని ఓల్డ్ మల్లాపూర్లో కౌండిన్య భవన్ వద్ద నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దంతూరి రాజు గౌడ్, తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్, తోపు అశోక్ గౌడ్ రంగు ప్రసాద్ గౌడ్, అచ్చగోని సతీష్ గౌడ్, మెరుపుల బాలరాజ్ గౌడ్, కోయకూర బాలరాజు గౌడ్, సాయి గౌడ్, సాయి, సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపయ్య గౌడ్ వర్ధంతి

సికింద్రాబాద్,విశాలభారతి:

సర్దార్ సర్వాయి పాపయ్య గౌడ్ 317 వ వర్ధంతి సికింద్రాబాద్ నియోజకవర్గం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సీతాఫల్మండిలో అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహంకాళి సికంద్రాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగపాణి విచ్చేసి సర్దార్ సర్వాయి పాపయ్య గౌడ్ దేశం కోసం రాజ్యం కోసం ఆయన చేసిన పోరాటాలను త్యాగాలను గుర్తు చేసారు. ఆనాడు మొగల్ సామ్రాజ్యాన్ని నిజాం నవాబులను ఎదిరించి పోరాడిన ఘనుడు సర్దార్ పాపన్న అని కొనియాడారు. దేశం కోసం ధర్మం కోసం అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి మొగల్ సామ్రాజవాదులను తరిమికొట్టిన ఘనత సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. మొగులను ఎదిరించిన మొట్టమొదటి వ్యక్తి సర్దార్ సర్వాయి పాపయ్య గౌడ్ ని గోల్కొండ ను కైవసం చేసుకొని పరిపాలించిన ఘనుడు సర్దార్ పాపయ్య గౌడని వారి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని మనమంతా ధర్మం వైపు నిలబడాలని దేశం కోసం పనిచేయాలని భరత్ గౌడ్,మేకల సారంగపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, వెంకటేష్ గౌడ్, పోచయ్య, భాస్కర్ గిరి, శారద మల్లేష్, మేకల కీర్తి హర్ష కిరణ్, వీరన్న,అంబాల రాజు, హనుమంతు ముదిరాజ్, రాము వర్మ, ఇవి నరేష్, ఉపేందర్ యాదవ్, ఆదర్శ్ కుమార్, సౌందర్య, సాయి గౌడ్, అనూష, సరోజినీ గౌడ్, భానుమతి, ప్రభు గుప్తా, సతీష్ ముదిరాజ్, బిక్షపతి యాదవ్ స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హనుమాన్ టెంపుల్, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన వినయ్ రెడ్డి

ఆర్మూర్, విశాలభారతి:

ఆర్మూర్ పట్టణం లోని చిరాయత్ నగర్ లో హనుమాన్ టెంపుల్ కమ్యూనిటీ హాల్ ను ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి బుధవారంప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిరాయత్ నగర్ తో మంచి అనుబంధం ఉందని తెలిపారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుండి రూ. 10 లక్షల మంజూరు చేపిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నగర పట్టణ అధ్యక్షులు ఏఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లింగ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఖందేష్ సంగీత శ్రీనివాస్,మురళి,జిమ్మీ రవి, భూపెందర్,రవికాంత్ రెడ్డి, హనుమాన్ కమ్యూనిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర


ఆర్మూర్,విశాలభారతి:

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాల్లో భాగంగా నందిపేట్ మండలంలోని సిద్ధాపూర్, వన్నెల్ (కే) గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ ప్రారంభించారు. మహనీయుల గురించి అసత్య ప్రచారాలుచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఇతర పార్టీల తీరును తిప్పి కొడుతూ రాజ్యాంగ విలువలను కాపాడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాదయాత్ర చేసి పార్టీ జెండాను ఎగురవేసి, నాయకుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిసీసీబి ఛైర్మెన్ కుంట రమేష్ రెడ్డి,పెంట ఇంద్రుడు,పిప్పెర సాయారెడ్డి,,లోక హన్మండ్లు, బొంకం గంగారెడ్డి,దూడ వెంకటేష్,లింగం ,శ్రీను,లక్ష్మి నారాయణ,మన్నే సాగర్,అల్లపు గంగాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు



# క్రేజ్ తగ్గట్టుగానే..

ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు ఎప్పుడు పాపులర్ అయ్యామన్నది ముఖ్యం అన్నట్టుగా ఇండస్ట్రీకి వచ్చి ఎన్నాళ్లయ్యింది అన్నది కాదు. ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది హీరోయిన్స్ కి లెక్క ఉంటుంది. అలా చేస్తున్న సినిమాలతో సినిమా సినిమాకు తమ రేంజ్ పెంచుకునే వారిలో చాలామంది భామలు ఉండగా వారిలో కొత్తగా డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ చేరింది. ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో అమ్మడు నటించగా ఆ సినిమాతో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. ఐతే ఈ సినిమాలో ఆమె పర్ఫార్మెన్స్ కి అదిరిపోయే మార్కులు పడ్డాయి. డ్రాగన్ ముందు వరకు కయదు రేంజ్ వేరు. ఆ సినిమా రిలీజ్ అయ్యాక కయదు లెవెల్ మారిపోయింది. డ్రాగన్ హిట్ తో యూత్ లో కయదుకి సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఐతే డ్రాగన్ బ్యూటీ తన పాపులారిటీకి తగినట్టుగానే ప్లానింగ్ చేస్తుంది. ఇప్పటికే తెలుగు, తమిళ్ లో వరుస ఆఫర్లు అందుకుంటుంది కయదు. అనుదీప్ కెవి, విశ్వక్ సేన్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో అమ్మడు లక్కీ ఛాన్స్ అందుకుంది. జాతిరత్నాలు సినిమా డైరెక్టర్, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరో కాబట్టి ఈ సినిమా తప్పనిసరిగా కయదుకి మంచి హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇదిలాఉంటే అమ్మడు సోషల్ మీడియా లో కూడా సందడి చేస్తుంది. ఆడియన్స్ లో తనకు వచ్చిన ఈ ఐడెంటిటీని మరింత పెంచుకునేలా చేస్తుంది కయదు లోహర్. అమ్మడు ఇలా ఫోటో షేర్ చేస్తే చాలు అలా వైరల్ అయిపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ అయితే కయదు అంటే చాలా క్రేజీగా ఉన్నారు. ఆల్రెడీ కయదు టాలెంట్ చూసే శ్రీవిష్ణు అల్లూరి సినిమాకు ఆమెకు తీసుకున్నాడు. కానీ ఆ సినిమా వర్క్ అవుట్ కాకపోవడంతో ఆమెను ఎవరు పట్టించుకోలేదు. డ్రాగన్ సినిమా సక్సెస్ తర్వాత శ్రీవిష్ణు అల్లూరి సినిమా వీడియోస్ ట్రెండ్ అయ్యాయంటే కయదుకి తెలుగులో ఉన్న ఫాలోయింగ్ ఎలాంటిదో అర్ధం చేసుకోవచ్చు. ఐతే పాపులారిటీ అందరికీ వస్తుంది కానీ దాన్ని సక్సెస్ ఫుల్ కెరీర్ గా మలచుకోవడంలోనే కథానాయికల క్లవర్ నెస్ ఆధారపడి ఉంటుంది. అందుకే కయదు కూడా మంచి ప్లానింగ్ తోనే సినిమాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. మరి తెలుగులో అమ్మడికి వచ్చిన ఈ క్రేజ్ తో స్టార్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లేలా తన సినిమాల సెలక్షన్ ఉంటుందా లేదా అన్నది చూడాలి.




# జాక్ పెద్ద టార్గెట్‌తో వస్తున్నాడా..?

గుంటూర్ టాకీస్ సినిమాతో మెప్పించిన సిద్ధు జొన్నలగడ్డ ఆ తర్వాత వచ్చిన ప్రతి ఛాన్స్ ని కాదనకుండా చేస్తూ వచ్చాడు. కొన్ని సినిమాల్లో విలన్ గా కూడా భయపెట్టాడు సిద్ధు. అలాంటి అతను హీరోగా మారి క్రిష్ణా అండ్ హిస్ లీలా సినిమా చేయగా ప్రేక్షకులు ఆదరించారు. ఆ తర్వాత డీజే టిల్లుగా దుమ్ముదులిపేశాడు. ఒక్కసారిగా సిద్ధు టాలెంట్ ఏంటో ఆడియన్స్ ని అర్ధమయ్యింది. డీజే టిల్లు సూపర్ హిట్ అవ్వడంతో టిల్లు స్క్వేర్ అంటూ ఆ సినిమా సీక్వెల్ గా మరో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు సిద్ధు. ఈ సినిమా అయితే చెప్పి మరీ సూపర్ హిట్ కొట్టాడు సిద్ధు. రెండు హిట్ సినిమాల తర్వాత సిద్ధు నెక్స్ట సినిమా మీద చాలా హోప్స్ ఉంటాయి. అంతేకాదు 100 కోట్ల హీరో కాబట్టి బిజినెస్ లెక్కలు కూడా భారీగా ఉంటాయి. సిద్ధు జొన్నలగడ్డ త్వరలో జాక్ సినిమాతో రాబోతున్నాడు. ఈ సినిమాను బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్ట్ చేయగా బేబీ విష్ణవి చైతన్య హీరోయిన్ గా నటించింది. జాక్ సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సిద్ధు ఈ సినిమాతో మరోసారి తన మ్యాజిక్ చేయాలని చూస్తున్నాడు. ఐతే ఆడియన్స్ కు టిల్లు రోల్ లో బాగా ఎక్కేసిన సిద్ధు ఆ పాత్ర నుంచి బయటకు వచ్చి జాక్ గా మెప్పించాల్సి ఉంటుంది. ఇది కొద్దిగా టఫ్ టాస్కే అయినా జాక్ చూసిన ఆడియన్స్ టిల్లుని మర్చిపోతారు అన్న రేంజ్ లో కాన్ ఫిడెన్స్ ఇస్తున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. సిద్ధు జాక్ ఏప్రిల్ 10న వస్తుంది. ఈ సినిమా బిజినెస్ కూడా ఇప్పటివరకు సిద్ధు సినిమాల్లో హైయెస్ట్ అని తెలుస్తుంది. మరి సిద్ధు ఈ జాక్ తో పెట్టుకున్న టార్గెట్ రీచ్ అవుతాడా లేదా అన్నది చూడాలి. సిద్ధు మార్క్ ఎంటర్టైనర్ తో పాటు మంచి కథ ఉంటే మాత్రం జాక్ సూపర్ హిట్ కొట్టినట్టే లెక్క. ఈ సినిమాలో హీరోయిన్ వైష్ణవి చైతన్య కూడా తన పాత్ర చాలా బాగుంటుందని స్పెషల్ గా చెబుతుంది. బొమ్మరిల్లు భాస్కర్ సినిమాలో హీరోయిన్ పాత్రలు నిజంగానే కథను నడిపిస్తాయి మరి ఈ జాక్ విషయంలో ఎలా ఉంటుందో చూడాలి. జాక్ తర్వాత నెక్స్ట తెలుసు కదా సినిమాతో రాబోతున్నాడు సిద్ధు. ఆ సినిమా కూడా తన మార్క్ మూవీగా సూపర్ ఫన్ ఎంటర్టైనర్ గా ఉండబోతుందని టాక్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.